ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహిద్దాం

కలెక్టర్ పి.అరుణ్ బాబు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జిల్లా వ్యాప్తంగా వివిధ కారణాలతో ఖాళీగా ఉన్న సర్పంచి, వార్డు మెంబర్ల పంచాయతీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని చర్యలూ తీసుకోవాలని కలెక్టర్ పి.అరుణ్ బాబు అధికారులకు సూచించారు. ఎన్నికల నిర్వహణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శుక్రవారం ఉదయం అన్ని మండలాల అధికారులతో టెలీ కాన్ఫిరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఖాళీగా ఉన్న సర్పంచులు, వార్డు మెంబర్లు, ఎన్నికలకు అన్ని సిద్ధం చేసుకోవాలన్నారు. ఎన్నికల కోడ్ కచ్చితంగా అమలు చేయాలని డిపిఒని ఆదేశించారు. వార్డ్ మెంబర్ల ఎన్నికలకు ఆగస్టు 19వ తేదీన పోలింగ్‌కు ఏర్పాట్లు చేయాలన్నారు. ఎన్నికలకు బ్యాలెట్ బాక్సులు , బ్యాలెట్ పేపర్లు సిద్ధం చేసుకోవాలని సూచించారు. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు.

సమన్వయంతో ముందుకెళ్తేనే అభివృద్ధి

- ◆ అన్ని శాఖల అధికారులు కలిసికట్టుగా పనిచేయాలి
- ◆ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి గుమ్మనూరు జయరాం
- ◆ కదిరి నియోజకర్గం అభివృద్ధిపై సమీక్ష

కదిరి నియోజకవర్గ సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి గుమ్మనూర్‌జయరాం

ప్రజాశక్తి-పుట్టపర్తి

పేదలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులకు అందించి, ఆయా నియోజకవర్గాల అభివృద్ధి కోసం సమన్వయంతో ముందుకు సాగుదామని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి గుమ్మనూరు జయరాం అధికారులకు సూచించారు. పుట్టపర్తి కలెక్టరేట్లోనే స్పందన సమావేశం మందిరంలో కదిరిశాసనసభ నియోజకవర్గ అభివద్ధిపై సమీక్షా సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఇన్‌ఛార్జి మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఈ సమావేశంలో కదిరి శాసనసభ్యులు డా॥పివి.సిద్ధారెడ్డి, కలెక్టర్ పి.అరుణ్ బాబు, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, జిల్లా అగ్రి అడ్వైయిజరీ బోర్డ్ ఛైర్మన్ రమణారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి జయరామ్ మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు సమావేశంలో ప్రస్తావించిన సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సంక్షేమం. అభివద్ధి ఎంత ముఖ్యమో అవినీతి రహిత పాలన కూడా కూడా అంతే ముఖ్యమన్నారు. కదిరి నియోజకవర్గాన్ని అభివద్ధి చేసేందుకు ఆయా శాఖల జిల్లా అధికారులు తగిన సహకారాన్ని అందించాలన్నారు. స్థానిక ఎమ్మెల్యేకి తోడుగా ఉండి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. నియోజకవర్గంలో ఇసుకల రీచులు ఏర్పాటు చేయడానికి ఆయా మండలాల తహశీల్దార్ల ఆధ్వర్యంలో ఇసుక రేవులను గుర్తించడానికి మండల స్థాయి కమిటీలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ కదిరి నియోజకవర్గానికి సంబంధించి అభివద్ధి పనుల్లో ఆయాశాఖల అధికారులు వేగవంతంగా పురోగతి చూపించాలని ఆదేశించారు. సమావేశంలో వివిధ రకాల సమస్యలు, అభివద్ధి పనులపై జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, ఎమ్మెల్యే అందించిన సూచనలు, సలహాలపై అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆగస్టు 17వ తేదీ నుంచి 19వ తేదీ వరకు నియోజక వర్గంలో భూ సేకరణ అంశాలపై సమగ్రంగా చర్చించి క్షేత్రస్థాయిలో తిరిగి నివేదికలు అందజేయాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. ఎమ్మెల్యే సిద్ధారెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో నెలకొన్న పలు సమస్యలను అధికారులు పరిష్కరించాలన్నారు. ఈ సమీక్ష సమావేశంలో ఇన్‌ఛార్జి జిల్లా సంయుక్త కలెక్టర్, పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్, డిఆర్ఒ కొండయ్య, మున్సిపల్ ఛైర్మన్ ఓబుళపతి, సిపిఓ విజయ్ కుమార్‌తో పాటు అన్ని శాఖల జిల్లా అధికారులు, తహశీల్దార్లు, ఎంపిడిఒలు పాల్గొన్నారు.

ఉలిక్కిపడ్డ వెంకటరమణపల్లి

- ◆ స్థలం వివాదంలో ప్రత్యర్థులపై వైసిపి మద్దతుదారుడి దాడి
- ◆ కర్రలు, కత్తులు, బీరుబాటిళ్లతో స్వైర విహారం
- ◆ 8 మందికి తీవ్ర గాయాలు
- ◆ పోలీసు స్టేషన్ వద్ద బాధితుల ఆందోళన

టిడిపి మద్దతుదారులపై దాడి చేస్తున్న కర్నాటక ప్రాంతం వాసులు

గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

ప్రజాశక్తి-గోరంట్ల రూరల్

శ్రీ సత్యసాయి జిల్లా గోరంట్ల మండలం వెంకటరమణపల్లిలో శుక్రవారం ఉదయం భయానక పరిస్థితులు నెలకొన్నాయి. ఓ స్థలం వివాదంలో టిడిపి, వైసిపి మద్దతుదారుల మధ్య నెలకొన్న వివాదం భౌతికదాడులకు దారితీసింది. వైసిపి మద్దతుదారుడు ఏకంగా కర్నాటక నుంచి మూడు వాహనాల్లో 15 మందిని రప్పించి కర్రలు, కత్తులు, బీరుబాటిళ్లతో విచక్షణా రహితంగా దాడి చేయించారు. ఈ దాడిలో ఒకే కుటుంబానికి చెందిన టిడిపి మద్దతుదారులు 8 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనతో గ్రామంలో ఒక్కసారిగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి...

గోరంట్ల మండల పరిధిలోని వెంకటరమణ పల్లి గ్రామం సర్వే నెంబర్ 326-2 రెండు సెంట్లలోని గ్రామకంఠం భూమిలో వడ్డె సోమశేఖర్, వడ్డె ఆదిమూర్తిలు దిబ్బను వేసుకున్నారు. దాదాపు 20 ఏళ్లుగా వీరి ఆధీనంలోనే ఈ స్థలం ఉంది. అయితే రెవెన్యూ అధికారులు ఈ స్థలాన్ని 2007లో నేసే గంగమ్మ పేరుపై పట్టా ఇచ్చారు. తాము అనుభవంలో ఉన్నందున ఈ స్థలం తమదే అంటూ వడ్డె సోమశేఖర్ కుటుంబ సభ్యులు గంగమ్మతో వాదిస్తూ వచ్చారు. దీనిపై కోర్టు కేసు కూడా నడుస్తోంది. ఈ క్రమంలోనే గంగమ్మ ఈ స్థలాన్ని అదే గ్రామానికి చెందిన వైసిపి మద్దతుదారుడు చౌడిరెడ్డికి 2022లో విక్రయించింది. స్థలాన్ని కొనుగోలు చేసిన ఆయన దానిని స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో గత నెల 27వ తేదీ వడ్డె సోమశేఖర్, వడ్డె ఆదిమూర్తి కుటుంబ సభ్యులకు, చౌడిరెడ్డి కుటుంబ సభ్యులకు మధ్య తీవ్ర ఘర్షణ జరిగింది. అప్పట్లో ఇరువర్గాలపై పోలీసులు కేసు నమోదు చేసి, నాలుగు రోజుల పాటు పోలీసు పికెటింగ్ ఏర్పాటు చేశారు.

శుక్రవారం ఉదయం ఒక్కసారిగా దాడి

వివాదం సర్దుమనిగిందనుకుంటున్న క్రమంలో శుక్రవారం ఉదయం 7 గంటల ప్రాంతంలో ఒక్కసారిగా ఘర్షణ చోటు చేసుకుంది. చౌడిరెడ్డికి చెందిన కర్నాటకకు చెందిన దాదాపు 15 మంది వ్యక్తులు మూడు కార్లలో వెంకటరమణపల్లికి వచ్చి వడ్డె సోమశేఖర్, వడ్డె ఆదిరెడ్డిల కుటుంబాలపై దాడికి తెగబడ్డారు. కర్రలు, బీరుబాటిళ్లతో విచక్షణా రహితంగా దాడి చేశారు. దాదాపు రెండు గంటల పాటు గ్రామంలో భయానక పరిస్థితులు నెలకొన్నాయి. ఈ దాడిలో వడ్డె సోమశేఖర్, వడ్డె ఆదిమూర్తి, వడ్డె భాగ్యరాజు, వడ్డె రామచంద్రప్ప, వడ్డె చిన్న గంగులప్ప, వడ్డె రత్నమ్మ, వడ్డె లక్ష్మిదేవి, వడ్డె ఐశ్వర్యలు గాయపడ్డారు. కర్రలతో కాళ్లు, చేతులపై కొట్టడంతో విరిగాయి. గ్రామంలో జరుగుతున్న ఘర్షణ వాతావరణాన్ని తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకున్నారు. ఘర్షణను అదుపు చేసి గాయపడిన వారిని చికిత్స నిమిత్తం 108లో గోరంట్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

పోలీసు స్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న బాధితుల బంధువులు

పోలీసు స్టేషన్ వద్ద బాధితుల బంధువుల ఆందోళన

గాయపడిన కుటుంబ సభ్యులు, బంధువులు గోరంట్ల పోలీసు స్టేషన్ వద్ద ఆందోళన చేపట్టారు. దాదాపు రెండు గంటల పాటు ఆందోళన నిర్వహించారు. పోలీసుల వైఫల్యం వల్లనే ఈ ఘటన చోటు చేసుకుందని తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. దాడి చేసిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అక్కడికి చేరుకున్న సిఐ సుబ్బరాయుడు వారితో మాట్లాడారు. కేసు నమోదు చేసి నిందితులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చి ఆందోళన విరమింపజేశారు. ఈ ఘటనపై ఇప్పటికే ఇద్దరిని అదుపులోకి తీసుకున్నామని, మరికొందరి కోసం గాలింపు చర్యలు చేపట్టామని సిఐ సుబ్బరాయుడు తెలిపారు. ముందస్తు చర్యగా గ్రామంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వడ్డెర్లపై దాడి విషయం తెలుసుకున్న తెలుగుదేశం పార్టీ వడ్డెర్ల సంఘం రాష్ట్ర నాయకులు వడ్డే వెంకట్, గోరంట్ల పోలీస్‌స్టేషన్ వద్ద బాధితులతో మాట్లాడారు. దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పేదలకు ఇళ్ల పట్టాలివ్వాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈఎస్ వెంకటేష్

రిలే దీక్షలో చెవిలో పూలతో వినూత్న నిరసన

రిలే దీక్షల్లో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఈఎస్ వెంకటేష్

ప్రజాశక్తి-పెనుకొండ

పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు రెండవ రోజైన శుక్రవారం కూడా కొనసాగాయి. ఇందులో భాగంగా సిపిఎం నాయకులు, ఇళ్ల లేని నిరుపేదలు చెవిలో పూలు పెట్టుకుని వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఈఎస్ వెంకటేష్ మాట్లాడుతూ నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నగర పంచాయతీ పరిధిలోని నిరుపేదలు ఇంటి స్థలం కోసం వ్యక్తిగతంగా దరఖాస్తు చేసుకుని పట్టాల కోసం రోడ్డెక్కి 4 నెలలు అవుతున్నా ప్రజాప్రతినిధులు, అధికారులకు పట్టదా అని విమర్శించారు. నిబంధనల ప్రకారం 90 రోజుల్లో ఇంటి పట్టాలు ఇవ్వాలని ఉన్నా ఇంతవరకు పరిష్కారం చేయకపోగా ప్రభుత్వ భూమిలో పేదలు వేసుకున్న గుడిసెలను దౌర్జన్యంగా పోలీసులతో తొలగించి సామగ్రి మొత్తాన్ని కాల్చి వేయడం రాష్ట్ర చరిత్రలో ఇదే ప్రథమమని తెలిపారు. పార్టీ, కులం, మతం, ప్రాంతం చూడకుండా ప్రజలకు సంక్షేమ పథకాలు అందజేస్తామని చెప్పి పేదల గుడిసెలు తొలగించడం విడ్డూరంగా ఉందన్నారు. గుడిసెల తొలగింపును నిరసిస్తూ అదే స్థలంలో పేదలకు ఇంటి పట్టాలు ఇవ్వాలని, లేనిచో పోరాటం ఉధతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న, జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్, జిల్లా కమిటీ సభ్యులు వెంకట్రాముడు, నారాయణ, స్థానిక సిపిఎం నాయకులు తిప్పన్న, పేదలు లక్ష్మిదేవి, మంజుల, మౌనిక, జయంతి, పవిత్ర, నాగలక్ష్మి, నాగవేణి, దిల్షాద్, శ్రీవర్షిని, లలిత, అరుణ, తదితరులు పాల్గొన్నారు.

తాడిమర్రిలో ఇళ్లు కూల్చివేత

తాడిమర్రిలో జెసిబిలతో ఇళ్ల కూల్చివేత

ప్రజాశక్తి-బత్తలపల్లి

తాడిమర్రి మండల కేంద్రంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఇళ్లను పరిహారం ఇవ్వకుండా శుక్రవారం అధికారులు జెసిబిలతో కూల్చివేశారు. దీంతో బాధితులు లబోదిబోమంటూ కన్నీటి పర్యవంతం అయ్యారు. షాపుల్లో ఉన్న సరుకులు ఎత్తి పెట్టుకోకుండానే షాపులు కూల్చివేత యజమానులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. బాధితులు అందరూ పోలీస్ స్టేషన్ దగ్గరికి వెళ్లగా పోలీసులు సర్ది చెప్పారు. ఓ వైపు ప్రజలు కూల్చివేత వద్దంటూ మొరపెట్టుకున్నా వారి మాటను వినకుండా అధికారులు ఇళ్ల కూల్చివేతను కొనసాగించారు. ఈ విషయం తెలుసుకున్న ధర్మవరం టిడిపి నియోజకవర్గం ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ తాడిమర్రికి చేరుకుని బాధితులతో మాట్లాడారు. ఎలాంటి సమాచారం ఇవ్వకుండా, పరిహారం ఇవ్వకుండా ఇలా కూల్చివేయడం దుర్మార్గం అన్నారు. బాధితులు అందరికీ న్యాయమైన పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

బాధితులతో మాట్లాడుతున్న పరిటాల శ్రీరామ్

వార్డు ఎన్నికల్లో 'అధికార' పెత్తనం

న్యామద్దెల, గంగినేపల్లితండాలో టిడిపి నామినేషన్ల తిరస్కరణ

ప్రజాశక్తి-చెన్నేకొత్తపల్లి

అధికార పార్టీ నాయకులు పంచాయతీ వార్డు మెంబర్ ఎన్నికల్లో సైతం పెత్తనం చెలాయిస్తూ అధికారులపై ఒత్తిడి తెచ్చి ప్రత్యర్థుల నామినేషన్లను తొలగిస్తున్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. మండల పరిధిలోని న్యామద్దెల పంచాయతీలో 6వ వార్డుకు ఉపఎన్నిక నిర్వహిస్తున్నారు. ఆ స్థానానికి టిడిపి మద్దతుతో పవన్‌కుమార్ స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు అందజేశారు. వాటిని పరిశీలించగా అందులో ఓ పేపర్ లేకపోవడంతో నామినేషన్‌ను తిరస్కరించినట్లు అధికారి తెలిపారు. దీనిపై ఆర్ఓని ప్రశ్నించగా నిర్లక్ష్యంగా సమాధానం ఇవ్వడంతో ఆగ్రహించిన టిడిపి శ్రేణులు మండల కన్వీనర్ ఆధ్వర్యంలో ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో ధర్నాకు దిగారు. దీంతో పోలీసులు అక్కడికి చేరుకుని వారిని స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ నామినేషన్ దాఖలు చేసిన సమయంలో ధ్రువీకరణ పత్రాలన్నీ సమగ్రంగా సమర్పించామని, అయితే ఎంపిడిఒ కార్యాలయంలో వైసిపి జడ్పిటిసి, ఎంపిపి, మండల కన్వీనర్, ఆర్ఓ కలిసి ఓ పేపర్‌ను తొలిగించి, అదే సాకుగా చూపి నామినేషన్‌ను తిరస్కరించారని ఆరోపించారు. అలాగే గంగినేపల్లి తండా అభ్యర్థి రవి నాయక్ 1వ వార్డుకు గురువారం గడువు లోపే నామినేషన్ దాఖలు చేశారన్నారు. అయితే ఇంటిగుత్త రశీదు జత చేయలేదని తిరస్కరించారన్నారు. స్థానిక వైసిపి నాయకుల ఒత్తిడితో సదరు పంచాయతీ సెక్రటరీ ఉద్దేశపూర్వకంగానే రవినాయక్‌కు సకాలంలో ఇంటి గుత్త రశీదు ఇవ్వలేదని మండిపడ్డారు. కలెక్టర్ స్పందించి ఆర్ఓపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

పకడ్బందీగా ఓటరు జాబితా పరిశీలన

సబ్ కలెక్టర్ కె.కార్తీక్

ప్రజాశక్తి-పెనుకొండ

ఓటరు జాబితా పరిశీలన ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని సబ్ కలెక్టర్ కె.కార్తీక్ సూచించారు. పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం స్పందన సమావేశ హాలులో శుక్రవారం సాయంత్రం హౌస్ టూ హౌస్ సర్వేలో నియోజకవర్గంలోని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ఇంటింటికీ ఓటరు సర్వేలో లోటు, పాట్లు ఉంటే తెలపాలన్నారు. అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు ఓటరు సర్వేలో పాల్గొని కార్యక్రమానికి సహకరించాలని కోరారు. బూత్ లెవెల్ అధికారులు ఈ నెల 21వ తేదీ వరకూ సర్వే చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఏఈఆర్ఓలు, ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ బి.హనుమంతు, ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ సి.గణేష్‌కుమార్, ఎలక్షన్ సీనియర్ అసిస్టెంట్ షాషావలి, ఎలక్షన్ కంప్యూటర్ ఆపరేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ భవనం పూర్తి చేయండి

టిఎన్ఎస్ఎఫ్ డిమాండ్

ప్రజాశక్తి-మడకశిర రూరల్

మండల పరిధిలోని రేకులకుంట గ్రామంలో ఉన్న ఎంజెపి ఎపి బిసిడబ్ల్యూ స్కూల్ వద్ద శుక్రవారం టిఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వినయ్ మాట్లాడుతూ ఎంజెపి ఎపి బిసిడబ్ల్యూ స్కూల్‌లో కనీస వసతులు కల్పించాలని కోరారు. అలాగే గుండమలలో అసంపూర్ణం గా ఉన్న భవనాన్ని పూర్తి చేసి విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ నాయ కులు పాల్గొన్నారు.

రేకులకుంట ఎంజెపి ఎపి బిసిడబ్ల్యూ స్కూల్ వద్ద నిరసన తెలుపుతున్న టిఎన్ఎస్ఎఫ్ నాయకులు

మండల సమావేశం రసాభాస

సమస్యలు ఏకరువు పెట్టిన ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి-సోమందేపల్లి

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపిపి గంగమ్మవెంకటరత్నం అధ్యక్షతన ఎంపిడిఒ వెంకటేశ్వ రావు ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశం ప్రజా సమస్యలపై ప్రజాప్రతినిధుల విమర్శలతో రసాభాసగా సాగింది. ముందుగా సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు గ్రామాల్లో నెలకొన్న పలు సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. సచివాలయ ఎఎన్ఎంలు గ్రామాల్లో పర్యటించడం లేదని దీంతో అనారోగ్యం బారిన పడిన వారు సోమందేపల్లిలోని ప్రభుత్వ, ప్రయివేటు ఆసుపత్రుకలు వెళ్తున్నారని తెలిపారు. భూసాయ గారిపల్లి ప్రాథమిక పాఠశాలలో మరుగుదొడ్లు లేవని సర్పంచి మండిపడ్డారు. గుడిపల్లి సచివాలయంలో లైన్‌మెన్, ఎనర్జీ అసిస్టెంట్ లేరని పలుమార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని సర్పంచి ఆవేదక వ్యక్తం చేశారు. ఏదైనా సమస్యపై ఫోన్ చేస్తే అధికారులు స్పందించడం లేదని బ్రహ్మసముద్రం సర్పంచి పరంధామ తెలిపారు. తాగునీటి బోర్లు పనిచేయడం లేదని, మురుగునీటి కాలువలు, రోడ్లు, కనీస వసతులు కల్పించడానికి నిధులు కేటాయించాలని సర్పంచులు కోరారు. స్పందించిన జడ్పిటిసి డిసి అశోక్ మాట్లాడుతూ జిల్లా పరిషత్ నుంచి ఎటువంటి గ్రాంట్‌లు కేటాయించలేదని, త్వరలో జరిగే జడ్పి సమావేశంలో ఈ విషయాన్ని ప్రస్తావిస్తానని సమాధానం ఇచ్చారు. ఎంపిపి మాట్లాడుతూ పంచాయతీల్లో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. అలాగే అందుబాటులో ఉన్న నిధులను ఉపయోగించి గ్రామాల్లో నీటి వసతి కల్పిస్తామని హామీ ఇచ్చారు. వైస్ ఎంపిపి వెంకటనారాయణరెడ్డి మాట్లాడుతూ నక్కలగుట్టలో కబ్జా చేసి ప్లాట్లు విక్రమిస్తున్నారని, వారిని అడ్డుకొని పేదలకు ఇంటి స్థలాలు కేటాయించాలని తహశీల్దార్ సురేష్‌కుమార్‌ను కోరారు. సమావేశంలో ఎంఇఒ ఆంజనేయనాయక్, ఎఒ కవితారాణి, ఈఒఆర్‌డి నాగరాజురావు, హౌసింగ్ ఎఇ నారాయణరెడ్డి, సర్పంచులు గంగాదేవి నరసింహారెడ్డి, గిరిజమ్మనాగరాజు, పరంధామ, రామాంజనేయులు, సోమశేఖర్, అంజినాయక్, కిష్టప్ప, ఎంపిటిసిలు పూజారి ఈశ్వరయ్య, నాగప్ప, నందిని, తదితరులు అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో సమస్యలు ఏకరువు పెడుతున్న సభ్యులు

మండలాల మార్పుతో ఉపాధ్యాయులకు ఇబ్బందులు

ప్రజాశక్తి-పెనుకొండ

లేపాక్షి మండలాన్ని కదిరి డివిజన్ పరిధిలోకి, కదిరి పరిధిలోని తలుపుల మండలాన్ని పెనుకొండ డివిజన్ పరిధిలోకి చేర్చడం అశాస్త్రీయ నిర్ణయమని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జయచంద్రారెడ్డి, ఎం.సుధాకర్ పేర్కొన్నారు. ఈ మేరకు పట్టణంలోని డివైఇఒ కార్యాలయంలో శుక్రవారం సిసి సోనికి యుటిఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లేపాక్షి మండలం పెనుకొండకి 50 కి.మీ దూరంలో, తలుపుల మండలం కదిరికి 25 కి.మీ దూరంలో ఉంటుందన్నారు. తలుపుల నుంచి పెనుకొండకు 103 కి.మీ దూరం ఉందన్నారు. కావున విద్యావ్యవహారాల విషయంలో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు ఎన్నో వ్యయప్రయాసలకు గురికావాల్సి ఉంటుందని, దీనిని దృష్టిలో ఉంచుకొని లేపాక్షి మండలాన్ని పెనుకొండ డివిజన్ పరిధిలో, తలుపుల మండలాన్ని కదిరి డివిజన్ పరిధిలోనే కొనసాగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి ఉపేంద్ర, హెచ్‌ఎం గోవిందరావు, పాల్గొన్నారు.

డివైఇఒ కార్యాలయంలో వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

పాత పెన్షన్ విధానం అమలు చేసేంత వరకూ పోరాటం

ఎపిటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోనంకి అశోక్ కుమార్

ప్రజాశక్తి-మడకశిర

పాత పెన్షన్ విధానం అమలు చేసేంత వరకూ పోరాడుతామని ఎపిటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోనంకి అశోక్ కుమార్ స్పష్టం చేశారు. పట్టణంలోని ఉపాధ్యాయ భవన్‌లో శుక్రవారం ఎపిటిఎఫ్ మండల శాఖ అధ్యక్షులు జయరామిరెడ్డి అధ్యక్ష తన సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన అశోక్ కుమార్ మాట్లాడుతూ సిఎం జగన్ అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లోనే సిపిఎస్ రద్దు చేస్తామని హామీ ఇచ్చి నేటికీ రద్దు చేయకపోవడం అన్యాయమన్నారు. జిపిఎస్ పేరుతో మరోసారి మరోసారి మోసం చేయడా నికి ప్రయత్నిస్తోందని, దానిని అంగీ కరించే ప్రసక్తి లేదన్నారు. పాత పెన్షన్ విధానం అమలు చేసేంత వరకూ పోరాడుతామన్నారు. రాష్ట్ర ఆడిట్ కన్వీనర్ బికె ముత్యాలప్ప, జిల్లా అధ్యక్షులు కోడూరు శ్రీనివాసులు ప్రసంగిస్తూ ఫ్యాప్టో ఆధ్వర్యంలో శనివారం(నేడు) పుట్టపర్తి ఆర్డీవో కార్యాలయం ఎదురుగా జరిగే 12 గంటల ధర్నాలో ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా కార్యదర్శి లతారామకృష్ణ, రాష్ట్ర కౌన్సిలర్ గవ్వల రామకృష్ణ, జయరామిరెడ్డి మాట్లాడుతూ డీఎస్సీ-2008, 1998 ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వెంకటేశ్వర్లు, సోమశేఖర్, రాఘువేంద్రరావు, తిమ్మారెడ్డి, మురళీధర్, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కోనంకి అశోక్‌కుమార్

పంట నమోదు, ఎరువుల పంపిణీ సకాలంలో చేపట్టాలి

పెనుకొండ : పంట నమోదు, ఎరువుల పంపిణీ సకాలంలో చేపట్టాలని జిల్లా స్థాయి వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ అవుటాల రమణారెడ్డి సూచించారు. ఖరీఫ్ పంట నమోదుపై శుక్రవారం ఆర్‌బికె సిబ్బంది, వీఆర్వోలకు మండల స్థాయి వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ కొండల రాయుడు ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా రమణారెడ్డి, పెనుకొండ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు స్వయం ప్రభ హాజరయ్యారు. ఈ సందర్భంగా రమణారెడ్డి మాట్లాడుతూ రైతులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారి సమస్యలు పరిష్కరించాలన్నారు. కొండలరాయుడు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఉన్న కౌలు రైతులందరికీ కౌలు రైతు పత్రాలను మంజూరు చేసి వారికి ప్రభుత్వం నుంచి వివిధ పథకాలు అందేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఎడిఎ క్రాప్ బుకింగ్ ప్రక్రియ గురించి వివరించారు. ఎలాంటి అవకతవకలు లేకుండా రెవెన్యూ, వ్యవసాయ శాఖల సమన్వయం తో పంట నమోదు చేపట్టాలని ఆదేశించారు. సమా వేశంలో ఎఒ బి.శంకరనాయక్, ఎఎస్ఒ, ఎఇఓ, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, విఆర్ఓలు, రైతు భరోసా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ

పెనుకొండ : పట్టణంలోని ఎరువుల దుకాణాలను శుక్రవారం ధర్మవరం వ్యవసాయ సహాయ సంచాలకులు కృష్ణయ్య తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక మన గ్రోమోర్ కేంద్రం, శ్రీలక్ష్మీ వెంకటేశ్వర ఫర్టిలైజర్స్, రాజేశ్వరీ ట్రేడర్స్, శివ సాయి ట్రేడర్స్ ఎరువుల దుకాణాల్లో నిల్వలు, రికార్డులను తనిఖీ చేశారు. ఎరువులను అధిక ధరకు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని దుకాణదారులను హెచ్చరించారు. ఆయన వెంట ఎఒ బి.శంకరనాయక్, విస్తరణాధికారి ఎం.అశోక్ కుమార్, పాల్గొన్నారు.

బాధితుడికి ఆర్థికసాయం

నల్లచెరువు : మండల కేంద్రానికి చెందిన గడ్డం నాగేష్, అనే తెలుగుదేశం పార్టీ కార్యకర్త అనారోగ్య సమస్యలతో బాధ పడుతున్నాడు. ఈ విషయాన్ని నల్లచెరువు మాజీ ఎంపీపీ మాబుసాబ్ మాజీ ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన కందికుంట నాగేష్ వైద్య ఖర్చుల నిమిత్తం రూ. 20వేలను టిడిపి మండల కన్వీనర్ రాజశేఖర్, చేతుల మీదుగా అందజేశారు.

యువతకు ఉపాధి కల్పనే ధ్యేయం

బుక్కపట్నం : గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడమే తమ ధ్యేయమనిసిల్క్ డెవలప్మెంట్ అధికారి ఖయ్యూం తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన జాబ్ మేళాలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ 11 కంపెనీల ప్రతినిధులతో జాబ్ మేళా నిర్వహించామన్నారు. ఈ మేళాకు 482 మంది విద్యార్థులు హాజరు కాగా 208 మంది వివిధ కంపెనీలకు ఎంపికయ్యారన్నారు. వీరందరికీ నియామక పత్రాలు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసులు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుపై అక్రమ కేసులు అన్యాయం

తనకల్లు : టిడిపి అధినేత చంద్రబాబుపై అక్రమ కేసులు బనాయించడం అన్యాయమని టిడిపి మండల నాయకులు విమర్శించారు. ఈ మేరకు మండలకేంద్రంలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో టిడిపి మండల కన్వీనర్ తొట్లి రెడ్డి శేఖర్ రెడ్డి. తెలుగు యువత మండల అధ్యక్షుడుకావడి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయన్నారు. స్థానిక పోలీసులు, వైసిపి నాయకత్వం, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుమ్మక్కై చంద్రబాబు పై దాడి చేయించారని ఆరోపించారు. పోలీసులు తమ విధి నిర్వహణను విస్మరించి బాధ్యతా రాహిత్యంతో ప్రవర్తిస్తున్నందుకు తగిన మూల్యం చెల్లించుకుంటారని హెచ్చరించారు.

పర్యావరణ పరిరక్షణ సామాజిక బాధ్యత

బత్తలపల్లి : పర్యావరణ పరిరక్షణ సామాజిక బాధ్యతగా గుర్తించాలని ఎంపీపీ బగ్గిరి త్రివేణి అన్నారు. శుక్రవారం మండలంలోని అప్రాచెరువు, మాల్యవంతం పంచాయతీల్లోని గ్రామ సచివాలయాల్లోనూ, పాఠశాలల్లోనూ. నామట్టి నాదేశం కార్యక్రమంలో భాగంగా శిలాఫలకాన్ని సర్పంచులు, అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని కోరారు. అనంతరం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో సర్పంచు మొరెడ్డిగారి శారదమ్మ, ఆర్డీవో దివాకర్, ఏపీవో ఆదెప్ప, వైసిపి మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి, సాగునీటి సంఘం మాజీ అధ్యక్షులు వెంకటరంగారెడ్డి, కోనారెడ్డి. ప్రతాప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్ల పరిశీలన

బత్తలపల్లి : మండలంలోని తంబాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని 3వ వార్డు స్థానానికి దాఖలైన నామినేషన్లను అధికారులు పరిశీలించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి దివాకర్, ఎంపీడీవో సౌజన్యకుమారి తదితరులు నామినేషన్ పత్రాలను పరిశీలించారు. ఈ స్థానానికి లక్ష్మీనారాయణమ్మ, నారాయణమ్మ ఇరువురు నామినేషన్ దాఖలు చేశారు. రెండు నామినేషన్లు సక్రమంగానే ఉన్నట్లు అధికారులు ప్రకటించారు. 14వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉందన్నారు. అనంతరం తుది జాబితా ప్రకటిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి, సర్పంచులు సానే జయచంద్రారెడ్డి, కంచనగారి రాజశేఖర్‌రెడ్డి టీడీపీ మండల కన్వీనర్ గోనుగుంట్ల నారాయణరెడ్డి, సురేంద్రనాయుడు, నాగభూషణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

ధర్మవరం టౌన్ : పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ధర్మవరం బ్రాంచ్ అధికారుల సహకారంతో కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో "డ్రగ్స్ రహిత ఆంధ్ర ప్రదేశ్ దిశగా" అనే అంశంపై అవగాహన సదస్సును సెబ్ సిఐ లక్ష్మీ దుర్గయ్య శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా సిఐ మాట్లాడుతూ డ్రగ్స్ తీసుకోవడం వలన వచ్చే ఇబ్బందులు, కలిగే నష్టాల గురించి వివరించారు. కళాశాల ప్రిన్సిపల్ సురేష్ బాబు మాట్లాడుతూ విద్యార్థులు తమ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఇలాంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఆదిశేషయ్య, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరేడ్‌తో శారీరక ధృఢత్వం

ధర్మవరం టౌన్ : పోలీస్ శాఖలో పెరేడ్ డ్రిల్ అనేది శారీరక దఢత్వం కొరకు నిర్వహిస్తారని వన్‌టౌన్ సిఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణంలో వన్ టౌన్ సిబ్బందితో పెరేడ్ డ్రిల్ ను పోలీస్ శిక్షణ కార్యక్రమ పద్ధతిలో నిర్వహించినట్లు చెప్పారు. ఇకనుంచి ప్రతి శుక్రవారం నిర్వహిస్తామని తెలిపారు. ఈ పెరేడ్ డ్రిల్ వల్ల పోలీసులు క్రమశిక్షణ తో ఉంటూ, మానసిక ఒత్తిడికి గురికాకుండా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేయండి

కదిరి టౌన్ : ఏపీ రాష్ట్ర రజక సంఘం ఆధ్వర్యంలో శ్రీ సత్య సాయి జిల్లా పుట్టపర్తి లో జరిగే మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆంజనేయులు పిలుపు ఇచ్చారు. ఈ మేరకు పట్టణంలో ఎపి రాష్ట్ర రజక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ జిల్లాలోని 7 నియోజకవర్గాల నుంచి పెద్ద ఎత్తున రజక కులస్తులు తరలివచ్చి జిల్లా మహాసభను జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా కన్వీనర్ బాపనపల్లి శ్రీనివాసులు, కదిరి డివిజన్ కన్వీనర్ నల్లబల్లె శివశంకర్, జిల్లానాయకులు టి నారాయణ, సి నారాయణప్ప, ఆది, నాగభూషణ తదితరులు పాల్గొన్నారు

ప్రీ స్కూల్ స్టేషనరీ కిట్లు పంపిణీ

హిందూపురం : పట్టణంలోని న్యూ హస్నాబాద్ అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం విద్యార్థులకు ప్రీ స్కూల్ స్టేషనరీ కిట్లను వార్డు కౌన్సిలర్ ఆసిఫ్‌వుల్లా చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు శాంతి, అనిత, అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

రైతులను అన్ని విధాలా ఆదుకోవాలి : ఎపి రైతుసంఘం

మోకాళ్లపై నిలబడి నిరసన తెలుపుతున్న నాయకులు

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను అన్ని విధాల ఆదుకోవాలని, అదేవిధంగా కేరళ తరహాలో రుణవిముక్తి కల్పించాలని ఏపీ రైతుసంఘం జిల్లా అధ్యక్షులు జంగాలపల్లి పెద్దన్న రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతాంగ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఏపీ రైతుసంఘం ఆధ్వర్యంలో నాయకులు, రైతులు శుక్రవారం స్థానిక కళాజ్యోతి సర్కిల్లో రోడ్డుపై మోకాళ్లపై నిల్చొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జంగాలపల్లి పెద్దన్న మాట్లాడుతూ పంటలు సక్రమంగా పండక, పండిన పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతాంగాన్ని ఆదుకోవాలనే ఆలోచన కూడా చేయలేదన్నారు. పేరుకే రైతు ప్రభుత్వం అని గొప్పలు చెప్పుకుంటోందని విమర్శించారు. రైతులకు సంబంధించి అన్ని రకాలరుణాలను మాఫీ చేయాలని, మోటార్లకు మీటర్లు బిగించే విధానాన్ని ప్రభుత్వం వెనక్కితీసుకోవాలని డిమాండ్ చేశారు. స్వామినాథన్ కమిషన్ ప్రతిపాదించిన సిఫారసులను అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం జిల్లానాయకులు పోతలయ్య, మండల అధ్యక్షులు కొత్తపేట మారుతి, ఏపీ చేనేత కార్మికసంఘం రాష్ట్ర అధ్యక్షులు పోలా రామాంజినేయులు, సీపీఎం నాయకులు ఎస్‌హెచ్ బాషా, సిఐటియు నాయకులు ఎల్ ఆదినారాయణ, చేనేత నాయకులు లక్ష్మీనారాయణ, రైతుసంఘం నాయకులు రేగాటిపల్లిరవి, వెంకటస్వామి, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధికదిగుబడులు

ప్రజాశక్తి - కొత్తచెరువు

పంటల సాగులో రైతులు యాజమాన్య పద్ధతులు తప్పనిసరిగా పాటించాలని దీంతో అధిక దిగుబడులు సాధ్యమని వ్యవసాయ అధికారి నటరాజు తెలిపారు మండల పరిధిలోని కో డపగానిపల్లె ఆర్‌బికెలో పొలంబడి కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన రైతులకు పలు సూచనలు చేశారు. నాణ్యమైన విత్తనాలను సాగు చేయాలన్నారు. పంటలకు వచ్చే తెగుళ్ల నివారణకు వ్యవసాయ శాఖ అధికారులతో సలహాలు తీసుకొని క్రిమి సంహార మందులను వాడాలన్నారు. పంట మార్పిడి విధానాన్ని తప్పనిసరిగా పాటించాలన్నారు అనంతరం పొలాల్లోకి వెళ్లి పంటలను పరిశీలించారు ఈ కార్యక్రమంలో సర్పంచి అలివేలమ్మ, ఎంపీటీసీ వరలక్ష్మి రాఘవేందర్ రెడ్డి, ఆర్‌బికె సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

ధర్మవరం టౌన్ : యాజమాన్య పద్ధతులతో రైతులు అధిక దిగుబడులను సాధించవచ్చని ఉద్యానవన శాఖ అధికారిణి అమరేశ్వరి తెలిపారు. ధర్మవరం నియోజకవర్గంలో దాదాపు 770 హెక్టార్ల విస్తీర్ణంలో దానిమ్మ సాగులో ఉందని, ఇటీవల కురిసిన వర్షాలకు బ్యాక్టీరియా తెగులు వ్యాపించడంతో, ప్రస్తుతం పూతదశ నుండి పిండి దశలో ఉన్న తోటల్లో బ్యాక్టీరియా తెగుల నివారణ యాజమాన్య పద్ధతులు పాటించాలని కోరారు. తెగులు నివారణ ఉపాయాలలో భాగంగా బ్యాక్టీరియా తెగులు సోకిన కాయలను ఎప్పటికప్పుడు తొలగించి, తోట బయట కాల్చివేయాలన్నారు. గాలిలో తేమ ఎక్కువగా ఉన్నప్పుడు తెగులు వ్యాప్తి జరగకుండా జీవ సిలేంద్ర నాశిని, సుడోమోనాస్ 5 మిల్లీలీటర్ల నీటితో కలిపి పిచికారీ చేయాలన్నారు.

పోలీసు పరేడ్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ

పంద్రాగస్టుకు పటిష్ట భద్రత : ఎస్పీ

పుట్టపర్తి రూరల్ : శ్రీ సత్య సాయి జిల్లాలో ఆగస్టు 15 న నిర్వహించే 75వ స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా జిల్లా, మండల కేంద్రాల్లో గట్టి భద్రత ఏర్పాట్లు నిర్వహించాలని ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ మాధవరెడ్డి ఆదేశించారు. స్వాతంత్రదినోత్సవ వేడుకల నిర్వహణలో భాగంగా పుట్టపర్తి లోని పోలీస్ పరేడ్ మైదానంలో జరుగు సాయుధ బలగాల పోలీస్ పరేడ్ రిహార్సల్స్‌ను జిల్లా ఎస్పీ మాధవ్ రెడ్డి శుక్రవారం సమీక్షించారు. వేడుకలలో భాగంగా ఎటువంటి భద్రత పరమైన లోపాలు లేకుండా చూడాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్పీతో పాటు అదనపు ఎస్పీ ఎన్.విష్ణు ఏఆర్ డిఎస్‌పి విజయ్ కుమార్, అడ్మిన్ ఆర్ఐ టైటస్, ఎంటిఒ నారాయణ, ఆర్ఐ శ్రీశైలం రెడ్డి, ఆర్ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ జిల్లా ప్లీనరీ సమావేశాలను జయప్రదం చేయండి

కదిరి టౌన్ : కదిరి పట్టణంలో ఈ నెల 24,25 తేదీలలో నిర్వహించే భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా ప్లీనరీ సమావేశాలను జయప్రదం చేయాలని ఆసంఘం నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు స్థానిక ఆర్‌అండ్‌బి బంగ్లాలో ప్లీనరీ సమావేశాలకు సంబంధించిన కరపత్రాలను ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్ ఆధ్వర్యంల విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు బాబ్‌జాన్, పట్టణ కార్యదర్శి విజయ్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్య పరిరక్షణ కోసం పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థుల భవిష్యత్తు కోసం ఎస్ఎఫ్ఐ అలుపెరగని పోరాటాలు చేస్తోందన్నారు. జిల్లాలో మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచన నింపడం కోసం , జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణ రూపొందించేందుకు ఎస్ఎఫ్ఐ జిల్లా ప్లీనరీ సమావేశాలకు కదిరి పట్టణం వేదిక కానుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు అనీష్, యశ్వంత్, యుటిఎఫ్ నాయకులు శ్రీనివాసులు, సుబ్బారెడ్డి, మల్లికార్జున, బ్రహ్మేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

బ్రిడ్జి పనులు ప్రారంభం

ప్రజాశక్తి - కదిరి టౌన్

పనులను పరిశీలిస్తున్న నాయకులు

కదిరి రూరల్ మండలం మద్దిలేరు వాగు రెండు సంవత్సరాల క్రితం భారీ వర్షాలకు దెబ్బతిన్నడంతో అప్పటినుండి చిప్పలమడుగు ,కొత్తపల్లి, రోద్దం వాండ్లపల్లి, నాగూరి వాండ్లపల్లి, గ్రామాల ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే సిద్దారెడ్డి గడప గడపకు ప్రభుత్వం లో భాగంగా ఆయా గ్రామాల్లో పర్యటించారు. మద్దలేరు వంతెన పూర్తిగా డ్యామేజీ అయిన కారణంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆ గ్రామాల ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఎమ్మెల్యే బ్రిడ్జి నిర్మాణ విషయాన్ని కదిరి ఎంపీపీ అమర్నాథ్ రెడ్డి కి అప్పజెప్పారు. గడపగడపకు పరిష్కారంలో బాగంగా బ్రిడ్జి పనిని పూర్తి చేయాలన్న ఎమ్మెల్యే ఆదేశానుసారం బ్రిడ్జి పనులను శుక్రవారం ప్రారంభించారు. సమస్య పరిష్కారానికి చొరవ తీసుకావడంతో ఆ నాలుగు గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

పట్టణ ప్రాంతాలలో ఎక్కడా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలందరికీ విధిగా అవగాహన కల్పించి, పట్టణ ఆరోగ్యానికి కృషి చేయాలని జిల్లా మలేరియా యూనిట్ ఆఫీసర్ కుళ్లాయప్ప నాయక్, మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం పట్టణంలోని మున్సిపల్ కౌన్సిల్ హాల్లో శానిటరీ ఇన్స్‌పెక్టర్లు, మేస్త్రీలు, ఆశా కార్యకర్తలు, ఎఎన్ఎంలు, వార్డు సచివాలయ కార్యదర్శులు, అర్బన్ హెల్త్ డాక్టర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కుల్లాయప్ప నాయక్, బండి శేషన్న మాట్లాడుతూ ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశమున్నందున అప్రమత్తంగా ఉండాలన్నారు. దోమల నియంత్రణపై ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. పారిశుధ్యం పట్ల జాగ్రత్తగా ఉండేలా అవగాహన కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ జయరాం నాయక్, మునిసిపల్ శానిటరీ ఇన్స్‌పెక్టర్లు మహబూబ్ బాషా, శ్యామ్సున్, కేశవ, మున్సిపల్ మేస్త్రీలు నాగరాజు, ఆంజనేయులు, నరసింహులు, పార్థసారథి, పట్టణ అర్బన్ హెల్త్ డాక్టర్లు జగదీష్, శ్రావణి, సురేష్ నాయక్, గౌతమి, చంద్రిక, ప్రియాంక,శ్వేత, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు, సచివాలయ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

సైకో పాలనలో సామాన్యుడికి రక్షణ కరువు : టిడిపి

గాయపడిన వారిని పరామర్శిస్తున్న సవితమ్మ

ప్రజాశక్తి-హిందూపురం

సైకో పాలనలో వైసిపి గుండాలు రెచ్చిపోతున్నారని వీరి పాలనలో సామాన్యుడికి రక్షణ కరువైందనిటిడిపి అధ్యక్షులు బికె పార్థ సారథి, పార్టీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి సవితమ్మ విమర్శించారు. శుక్రవారం పెనుకొండ నియోజకవర్గం గోరంట్ల మండలం వెంకటరమణపల్లి గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్తలపై భూమి తగాదా విషయంలో స్థానిక వైసీపీ నాయకుడు చౌడిరెడ్డి, ఇతర ప్రాంతాల నుండి 10 మందిని తీసుకువచ్చి వేట కొడవళ్ళతోను, బీరు బాటిళ్ల తో దాడి చేయగా తీవ్రంగా గాయపడిన వారిని హిందూపురంలోని ప్రభుత్వ వైద్యశాలకు, బెంగళూరు తీసుకువెళ్లారు. హిందూపురం ప్రభుత్వ అసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని పార్థ సారథి, సవితమ్మ, అంబికా లక్ష్మీనారాయణలు పమామర్శించి, వారికి ధైర్యం చెప్పారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతోందని కూలి పనులు చేసుకునే పేద కుటుంబాలపై వైసిపికి చెందిన మాజీ సింగిల్ విండో ప్రెసిడెంట్ చెవిరెడ్డి రౌడీలను తీసుకుని వచ్చి దాడులు చేయడం అత్యంత దుర్మార్గమని అన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి తక్షణమే అరెస్టు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వడ్డెర సాధికారిక కన్వినర్ వడ్డే వెంకట్, పరిగి కన్వీనర్ టి.లక్ష్మిరెడ్డి, జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు డి.శివశంకర్, జిల్లా బిసి సెల్ అధికార ప్రతినిధి శేఖర్, జిల్లా ఉపాధ్యక్షుడు కుమార్, వడ్డేర సాధికార రాష్ట్ర కమిటీ సభ్యుడు హనుమయ్య తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా టిడిపి నాయకులు కురుబ కష్ణమూర్తి ఈ ఘటనను తీవ్రంగా ఖండించారు.

సున్నా వడ్డీ కింద జిల్లాకు రూ. 52.38 కోట్లు మంజూరు

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్



మెగాచెక్కు విడుదల చేస్తున్న మంత్రి, తదితరులు

సున్నా వడ్డీ కింద జిల్లాలో స్వయం సహాయక సంఘాలకు 52.38 కోట్లు మంజూరు అయింది. శుక్రవారం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కోనసీమ జిల్లా అమలాపురం మండలంలో బటన్ నొక్కి రాష్ట్రవ్యాప్తంగా మహిళా సంఘాలకు సున్నా వడ్డీ నిధులు మంజూరు చేశారు. సత్యసాయి జిల్లా కలెక్టరేట్ లో రాష్ట్ర మంత్రి గుమ్మనూరు జయరాం తో పాటు జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు, కదిరి ఎమ్మెల్యే పివి సిద్ధారెడ్డి, జిల్లా స్థాయి అధికారులు స్థానిక నాయకులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ దృశ్యాన్ని వీక్షించారు. అనంతరం జిల్లాలోని 36,928 సంఘాలకు 3,91,440 మంది మహిళలకు వైఎస్ఆర్ సున్నా వడ్డీకి సంబంధించి రూ. 52.38 కోట్లు మెగా చెక్కును సంఘాల ప్రతినిధులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ, అగ్రి బోర్డు చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఓబుళపతి, వైస్ చైర్మన్లు శ్రీలక్ష్మి, తిప్పన్న, పుడా చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ, పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్, డిఆర్ఓ కొండయ్య, డిఆర్‌డిఎ పీడీ నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు అవసరమైన పనిముట్లు ఇవ్వాలి

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

మున్సిపల్ కార్మికులకు అవసరమైన పనిముట్లు అందించాలని టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ నిత్యం పట్టణాన్ని శుభ్రంగా ఉంచుతున్న కార్మికులకు హ్యాండ్ బ్లౌజులు, అవసరమైన పరికరాలు అందించాలన్నారు. కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి పారిశుధ్యం కోసం పనిచేసిన కార్మికులను ఫ్రంట్ లైన్ వారియర్స్ అంటూ పొగిడిన ప్రభుత్వం, పాలకులు ఇప్పుడు వారికి కనీస సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. దీంతో వారు అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. వారికి హెల్త్ రిస్క్ అలవెన్స్ లు ఇవ్వాలని పెండింగ్ లో ఉన్న పిఎఫ్, ఇఎస్ఐ అమలు పరచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, కార్మికుల సంఖ్య కూడా పెంచాలని డిమాండ్ చేశారు

ప్రత్యామ్నాయ విత్తనాలు పంపిణీ

ఓబుల దేవర చెరువు : మండలంలోని అర్హులైన రైతులకు ప్రత్యామ్నాయ విత్తనాలు ఉలవలు 80 శాతం సబ్సిడీపై ప్రభుత్వం పంపిణీ చేస్తోందని ఎఒ ఇలియాస్ అహ్మద్ తెలిపారు.కావలసిన రైతులు రైతు భరోసా కేంద్రంలో సోమవారం నుండి తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

గ్రూపు విభేదాలను రూపుమాపుతాం :కాంగ్రెస్

ప్రజాశక్తి - కదిరి అర్బన్

కదిరి నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీలో నెలకొన్న గ్రూపు విబేధాలను రూపుమాపుతామని ఆపార్టీ నియోజకవర్గ కన్వీనర్ ఆశ్వర్థనారాయణ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక రోడ్డు భవనాల అతిథిగృహంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ చిన్నచిన్న అడుగులతో కోలుకునే స్థానిక సాయశక్తులకు కృషి చేస్తామన్నారు. నియోజకవర్గంలో పార్టీలో గ్రూపు విభేదాలు ఉన్న మాట వాస్తవమేనని అయితే మూడు గ్రూపుల్లో నెలకొన్న విబేధాలను పరిష్కరించి పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని చెప్పారు. ఈ సమావేశంలో నాయకులు హరిప్రసాద్, పిఎస్ అహ్మద్ హుస్సేన్, షాన్వాస్ తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

హిందూపురం రైల్వే స్టేషన్‌లో 10 కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి-హిందూపురం

అరెస్టు వివరాలను వెల్లడిస్తున్న సిఐ నాగరాజు

హిందూపురం పట్టణంలోని రైల్వే స్టేషన్ లో గురువారం రాత్రి 10 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని ముగ్గురిపై కేసు నమోదు చేశామని ఈ కేసులు ప్రధాన నిందితుడిని అరెస్టు చేశామని రైల్వే సిఐ నాగరాజు తెలిపారు. ఈ మేరకు ఆయన ౖల్వే పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గంజాయి స్వాధీనం వివరాలను వెల్లడించారు. బెంగళూరులోని బెలేహా హల్లి కి చెందిన వరుణ్ కుమార్ శ్రీకాకుళం జిల్లా ఇచ్చాపురం నుంచి గంజాయిని అక్రమంగా తీసుకొని వచ్చి మరో ఇద్దరితో కలిసి వ్యాపారం చేస్తున్నాడు. ఈ మేరకు 10 కేజీల గంజాయిని ప్రశాంతి ఎక్స్ ప్రెస్ లో ఇచ్ఛాపురం నుంచి బెంగళూరు సిటీకి తీసుకు వెళుతున్నారు. సిటీలో పోలీస్ చెకప్ ఎక్కువ ఉందన్న సమాచారంతో గంజాయి తీసుకు వస్తున్న వరుణ్ కుమార్ హిందూపురం రైల్వే స్టేషన్‌లో దిగాడు. సాయంత్రం వరకు బయట కాలుక్షేపం చేసుకొని రాత్రికి బెంగళూరు వెళ్లడానికి కుర్ల ఎక్స్ ప్రెస్ రైలు ఎక్కడానికి 3వ నెంబర్ ప్లాట్‌ఫారమ్ వద్దకు వచ్చాడు. అనుమానస్పదంగా ఉన్న వరుణ్‌ను రైల్వే పోలీసులు గమనించి సోదాలు చేశారు. దీంతో వారు రెండు బ్యాగుల్లో ఉన్న గంజాయి గమనించారు. వరుణ్‌ను అదుపులోకి తీసుకొని విచారణ చేస్తే ఇతనితో పాటు గణేష్, మరో వ్యక్తి కలిసి గంజాయి వ్యాపారం చేస్తున్నట్లు తేలింది. దీంతో హిందూపురం తహశీల్దార్ సమక్షంలో విచారణ చేసి ప్రధాన నిందితుడు వరుణ్ కుమార్‌తో పాటు మరో ఇద్దరిపై కేసు నమోదు చేసి, గుంతకల్లు రైల్వే కోర్టులో హాజరు పరుస్తున్నట్లు రైల్వే సిఐ నాగరాజు తెలిపారు. పరారీలో ఉన్న మరో ఇద్దరు నిందితుల కోసం గాలిస్తున్నట్లు తెలిపారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించిన రైల్వే ఎస్ఐ బాలాజీ నాయక్, ఆర్‌పిఎఫ్ ఎస్ఐ కెంపరాజులతో పాటు సిబ్బందిని సిఐ అభినందించారు.

గొర్రెల చోరీ కేసు ఛేదింపు

మడకశిర రూరల్ : గొర్రెల చోరీ కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు సిఐ సురేష్‌బాబు తెలిపారు. పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం సిఐ విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ నెల 6వ తేదీ అర్ధరాత్రి బుల్లసముద్రం గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తులు 30 గొర్రెలను ఎత్తుకెళ్లారు. దీంతో సిఐ, ఎస్ఐ లోకేష్ ఆధ్వర్యంలో పోలీసులు రెండు బృందాలుగా ఏర్పడి శుక్రవారం కదిరేపల్లి క్రాస్ వద్ద ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి వారి నుంచి బొలెరో వాహనం, 30 గొర్రెలు, 3 సెల్‌ఫోన్లు, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు. గొర్రెలను కాపరి ఈరన్నకు అప్పజెప్పారు. నిందితులు శ్రీనివాసులు, నాగేష్, రాజగోపాల్‌పై కేసు నమోదు చేశారు. కేసును ఛేదించిన పోలీసులను సిఐ అభినందించారు. సమావేశంలో ఎస్ఐ లోకేష్, పోలీసులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో 20 ఏళ్ల జైలు

గోరంట్ల రూరల్ : గోరంట్ల స్టేషన్ పరిధిలో 2019లో నమోదైన పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష, రూ. 5వేల జరిమానా విధిస్తూ అనంతపురం పోక్సో కోర్టు జడ్జి రాజ్యలక్ష్మి శుక్రవారం తీర్పు వెలువరించారు. వివరాలు.. గోరంట్ల పట్టణంలోని చౌడేశ్వరి కాలనీకి చెందిన ఈశ్వరయ్య అదే కాలనీలో నివాసం ఉంటున్న ఓ బాలికపై ఇంట్లో ఎవరూ లేని సమయంలో లైంగికంగా దాడి చేశాడు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు 2019 ఆగస్టు 8వ తేదీన గోరంట్ల పోలీస్ స్టేషన్‌లో సిఐ జె.జయనాయక్ పోక్సో కేసు నమోదు చేశారు. అనంతరం అప్పటి ధర్మవరం డిఎస్పీ రమాకాంత్ ఆధ్వర్యంలో దర్యాప్తు కొనసాగి నిందితుడిని అరెస్ట్ చేశారు. ఈ కేసులో సాక్షులను విచారించిన అనంతరం అనంతపురం పోక్సో కోర్టు శుక్రవారం తుది తీర్పును వెలువరించింది. ఈ కేసులో ముద్దాయికి శిక్ష పడేలా చేసిన విచారణ అధికారి డిఎస్పీ రమాకాంత్‌ని, ఎపిపి విద్యావతిని, కోర్టు కానిస్టేబుల్ వెంకటేష్‌నాయక్, గోరంట్ల సిఐ సుబ్బరాయుడుని ఎస్పీ మాధవరెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. దీనిపై ఎస్పి మాట్లాడుతూ సమాజంలో నేరాలకి పాల్పడే వ్యక్తులు ఎవరైనా, వారు ఎంతటి వారైనా వదిలిపెట్టేది లేదని, ఎలాంటి కేసుల్లోనైనా వీలైనంత త్వరగా విచారణ పూర్తి చేసి నిందితులకు చట్టం ద్వారా శిక్ష పడేలా చేస్తామని హెచ్చరించారు.

పేకాట జూదరులు అరెస్టు

గుడిబండ : మండల పరిధిలోని పూజారిపల్లి గ్రామ సమీపంలో జూదం ఆడుతున్నట్లు సమాచారం అందడంతో ఎస్ఐ మునిప్రతాప్ గుడిబండ, రొళ్ల, మడకశిర, కర్నాటకలోని పావగడ మండలాలకు చెందిన పోలీసు సిబ్బందితో కలిసి దాడులు చేసి 12 మంది జూదరులను అరెస్టు చేశారు. అలాగే వారి నుంచి రూ. 2,61,150 నగదు, 5 ద్విచక్ర వాహనాలు, 12 సెల్ ఫోన్లు స్వాధీన పరుచుకుని గుడిబండ స్టేషన్లో మడకశిర సిఐ సురేష్‌బాబు ముందు హాజరు పరిచారు. అనంతరం గుడిబండ పోలీస్ స్టేషన్ ఆవరణలో సిఐ శుక్రవారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. జూదరులపై గ్యాంబ్లింగ్ యాక్ట్ కేసు నమోదు చేశామని, వారిని త్వరలోనే కోర్టుకు హాజరు పరచనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎఎస్ఐ చంద్రశేఖర్, కానిస్టేబుళు హరినాథ్, మహమ్మద్‌రఫీ, లోకేష్‌నాయక్, హోంగార్డు చంద్రశేఖర్, జగన్నాథ్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

బరితెగించిన రెవెన్యూ ఉద్యోగులు

వడ్డీ వ్యాపారి అవతారమెత్తిన ఉద్యోగి

కార్యాలయంలోనే తోటి ఉద్యోగితో వాగ్వాదం

పరిగి : స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో కొందరు రెవెన్యూ ఉద్యోగులు బరితెగించారు. ఓ ఉద్యోగి వడ్డీవ్యాపారి అవతారమెత్తారు. తోటి ఉద్యోగులకు అధిక వడ్డీకి అప్పు ఇచ్చి వారు సకాలంలో ఇవ్వకపోవటంతో కార్యాలయంలోనే బెదిరింపులకు దిగుతున్నాడు. ఇలాంటి సంఘటన స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో శుక్రవారం చోటు చేసుకుంది. అందుకు సంబంధించి బాధితుడు, స్థానికులు తెలిపిన వివరాలు... స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న అటెండర్ వెంకటేష్ వడ్డీ వ్యాపారి అవతారం మెత్తాడు. తోటి ఉద్యోగుల అవసరాలకు అప్పు ఇచ్చి చక్రవడ్డీ పేరుతో వేల రూపాయలు వసూలు చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఇదే మండలంలో పనిచేస్తున్న ఓ వీఆర్వో లేపాక్షి, చిలమత్తూరు మండలంలో పనిచేసే సమయంలో వెంకటేష్ వద్ద 2018 సంవత్సరంలో 2 లక్షల రూపాయలు నగదు వడ్డీ రూపంలో తీసుకున్నాడు. అప్పటి నుండి వేల రూపాయలు వడ్డి రూపంలో వెంకటేష్ వసూలు చేశాడు. ఈ నేపథ్యంలో ఇచ్చిన అప్పు, వడ్డీ సకాలంలో ఇవ్వలేదని వెంకటేష్ బాధిత విఆర్ఒతో శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద వాగ్వాదానికి దిగాడు. వెంకటేష్ వైఖరిపై తోటి ఉద్యోగులు, స్థానికులు తీవ్ర విమర్శలు చేస్తున్నారు. తహశీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న వెంకటేష్ వ్యాపారమే ప్రధానంగా భావించి 2022 సంవత్సరం ఇక్కడ వీఆర్వోల నుండి వీఆర్ఏల వరకు లక్షల రూపాయలకు వడ్డీకి ఇచ్చి వ్యాపారాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈయన సమయానికి కార్యాలయానికి రాకుండా హిందూపురంలోని ఎన్జీవో క్యాంటీన్ సమీపంలో తన లావాదేవీలు నిర్వహిస్తూ లక్షల రూపాయలను ఇతరుల నుండి వడ్డీ రూపంలో వసూలు చేస్తూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలుస్తోంది. ఈయన వేధింపులు భరించలేక తాను ఆత్మహత్య చేసుకునే పరిస్థితి ఉందని బాధిత విఆర్ఓ వాపోతున్నాడు. ఈ ఘటనను బట్టి చూస్తే వెంకటేష్ వ్యవహార శైలి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈ సంఘటనపై తహశీల్దార్ సౌజన్య లక్ష్మిని వివరణ కోరగా పూర్తిస్థాయి విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

9న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి-హిందూపురం

ఉన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు సెప్టెంబర్ 9వ తేదీన జాతీయ లోక అదాలత్ నిర్వహిస్తున్నట్లు అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ శుక్రవారం తెలిపారు. స్థానిక కోర్టు ఆవరణలో జరిగే ఈ అదాలత్‌లో రాజీ కాదగిన క్రిమినల్, సివిల్ కేసులతో పాటు ప్రీ లిటిగేషన్ కేసులను పరిష్కరించుకోవచ్చన్నారు. కక్షిదారులు రాజీమార్గంలో కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు. వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రజా సంఘాలు, బార్ అసోసియేషన్ సభ్యులు లోక్ అదాలత్ విజయవంతం కావడానికి సహకారాన్ని అందించాలని కోరారు.

మహిళల జీవనప్రమాణాలు మెరుగుపరచడానికే సున్నా వడ్డీ రుణాలు

బత్తలపల్లిలో మెగా చెక్కు అందజేత

ముఖ్యమంత్రి ప్రసంగాన్ని తిలకిస్తున్న 'పురం' నాయకులు,అధికారులు

కదిరిలో మంజూరుపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి బత్తలపల్లి

మహిళల జీవన ప్రమాణాలను మెరుగుపర్చడానికే ప్రభుత్వం సున్నా వడ్డీ రుణాలను అందజేస్తోందని ఎంపీపీ బగ్గిరి త్రివేణిరెడ్డి, జెడ్పీటీసీ కోటి సుధ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన వైఎస్ఆర్ సున్నా వడ్డీ నాలుగో విడత మెగా చెక్ పంపిణీ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పొదుపు సంఘాలలోని మహిళలు బ్యాంకులలో రుణాలు పొంది వివిధ వ్యాపారాలు చేస్తూ ఆర్థికంగా నిలదొక్కుకోవాలన్నారు. అనంతరం మండలంలోని 806 మహిళ సంఘాలకు చెందిన 8567 మంది సభ్యులకు రు.1,21,85,744 రూపాయల విలువైన మెగా చెక్కును అందజేశారు. అంతకుమునుపు ముఖ్యమంత్రి జగనన్న చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ సౌజన్యకుమారి, ఎపిఎం సుదర్శన్ రాజు, మండల సమాఖ్య ప్రతినిధులు ఎల్సీ లక్ష్మీనారాయణ, సీసీలు సుధాకర్, వెంకటసత్యం, నాగనంద్,శంకర్ తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : హిందూపురం పురపాలక సంఘంలో మహిళాలకు నాలుగు సంవత్సరాల్లో రూ.12.49 కోట్లు లబ్ధి చేకురిందని వైసిపి సమన్వయ కర్త, ఇన్‌చార్జ్ దీపిక అన్నారు. స్వయం సహాయక సంఘాలకు 4 వ విడత వైయస్సార్ సున్నా వడ్డీ నిధులు పంపిణీ కార్యక్రమంలో నియోజకవర్గ ఇంచార్జ్ దీపిక పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొత్తం నాలుగు సంవత్సరాలకు హిందూపురం పురపాలక సంఘంలో సున్నా వడ్డీ క్రింద రూ.12.49 కోట్లు మంజూరు అయిందన్నారు. త్వరలో ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి మెగా చెక్కును అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ గని, మున్సిపల్ వైస్ చైర్మన్ బలరాం రెడ్డి జబివుల్లా,కౌన్సిలర్లు శివ, ఆసిఫ్, షాజియా, పార్వతీ నాగరాజు, గిరి, మల్లికార్జున, మణి, నాగరాజు, మల్లికార్జునగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : కదిరి మున్సిపాలిటీ కి చెందిన 10 వ వార్డు సచివాలయ పరిధిలోని మహిళ స్వయం సహాయక గ్రూపులకు వైస్సార్ సున్నా వడ్డీ పథకం నాలుగవ విడత పంపిణీని శుక్రవారం చేపట్టారు. ఆ వార్డు కౌన్సిలర్ కె ఎస్ దిల్షాదున్నిసా, వైసిపి పట్టణ అధ్యక్షులు కె ఎస్ బహావుద్దీన్ లబ్ధి దారులకు మెగా చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీ కృష్ణమూర్తి, ఎడ్యుకేషన్ సెక్రెటరీ కార్తీక్, ఆర్‌పిలు ఖంరూన్, తస్లీమా, గ్రూపు లీడర్లు, సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఓబుల దేవర చెరువు : డ్వాక్రా మహిళలకు చెందిన బ్యాంక్ రుణాలకు వైయస్సార్ సున్నా వడ్డీ మొత్తాన్ని మహిళ సంఘాల రుణ ఖాతాలకు జమ చేసినట్లు ఏపీఎం రమణప్ప తెలిపారు.మండలానికి చెందిన 1078 మహిళా సంఘాల్లోని 11516 మందికి రూ.1,42,14,206లు విడుదల అయ్యాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సీసీలు, డ్వాక్రా మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రికి ఆక్సిజన్ ఆటో ఎక్స్‌పో మీటర్లు అందజేస్తున్న దాతలు

ఆసుపత్రికి ఆక్సిజన్ ఆటో ఎక్స్‌పో మీటర్లు అందజేత

ప్రజాశక్తి -పెనుకొండ

పట్టణంలోని ప్రభుత్వాసుపత్రికి శుక్రవారం కొరియన్ అసోసియేషన్ ఇన్ ఆంధ్రప్రదేశ్ వారు రూ. 4 లక్షలు విలువ చేసే ఆక్సిజన్ ఆటో ఎక్స్‌పో మీటర్లు, బూస్ట్ పదార్థాలను డాక్టర్ శివకుమార్‌స్వామి, బాబా బుడెన్ సమక్షంలో హాస్పిటల్ కమిటీ మెంబర్ కొండలరాయుడు ఆధ్వర్యంలో అందజేశారు. కొరియన్ బృందం ఒక అసోసియేషన్‌గా ఏర్పడి అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా అసోసియేషన్ అధ్యక్షుడు మిస్టర్ జోంగ్ 15 మంది మిత్ర బృందం వాటిని అందజేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

పిహెచ్‌సిలో గర్భిణులకు అన్నదానం చేస్తున్న ఉపాధ్యాయుడు సంజీవరాయుడు

పిహెచ్‌సిలో గర్భిణులకు భోజన వసతి

సోమందేపల్లి : స్థానిక సాయినగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న సంజీవరాయుడు శుక్రవారం స్థానిక పిహెచ్‌సిలో వైద్య పరీక్షలకు హాజరైన గర్భిణులకు భోజన వసతి ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, గర్భిణులు పాల్గొన్నారు.

దిష్టిబొమ్మతో నిరసన వ్యక్తం చేస్తున్న బాధిత ఉద్యోగులు

అన్యాయాన్ని నిరసిస్తూ దిష్టిబొమ్మ దహనం

హిందూపురం : పవర్ జెఎసి, విద్యుత్ మేనేజ్‌మెంట్‌తో బుధవారం జరిపిన చర్చల్లో కాంట్రాక్టు కార్మికులకు తీవ్ర అన్యాయం జరిగిందని కాంట్రాక్టు ఉద్యోగులు అన్నారు. ఈ అన్యాయాన్ని నిరసిస్తు శుక్రవారం పవర్ జెఎసి దిష్టి బొమ్మతో ర్యాలీ నిర్వహించి, డీఈ కార్యాలయ ఆవరణంలో ఉన్న 220కెవి సబ్ స్టేషన్ వద్ద దహనం చేశారు. తమకు న్యాయం చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజశేఖర్ నాగరాజు, బలరాం, శ్రీనివాసులు, శ్రీనాథ్, నిరంజన్‌తో పాటు కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

సమస్యలపై స్పందించాలి

హిందూపురం : పురపాలక సంఘ వ్యాప్తంగా విధులు నిర్వహిస్తున్న సచివాలయ సెక్రటరీలు ప్రజా సమస్యలపై వెంటనే స్పందించాలని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ అన్నారు. పట్టణంలోని సప్తగిరి కళాశాలలో సెక్రటరీలకు డిజిటల్, సోషల్ మీడియా అవేర్‌నెస్ కార్యక్రమంతో పాటు స్థిరమైన లక్ష్యాలు, కీలక పనితీరు సూచికలు, సేవా నిబంధనలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కమిషనర్ మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న విషయాలను ప్రతి ఒక్కరు పాటిస్తు, సమస్యలపై వెంటనే స్పందించి, ప్రజలకు మంచి సేవలను అందించాలన్నారు.

శిక్షణ వివరాలను వెల్లడిస్తున్న కమిషనర్ ప్రమోద్ కుమార్

ప్రయివేటుకు దీటుగా ప్రభుత్వ విద్య

తలుపుల : ప్రయివేటు పాఠశాలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన జరుగుతోందని స్థానిక ప్రభుత్వ ఉన్నతా పాఠశాల హెచ్‌ఎం శంకరన్న పేర్కొన్నారు. స్థానిక గవర్నమెంట్ హై స్కూల్లో శుక్రవారం పేరెంట్స్ మీటింగ్ ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న విద్యాబోధన గురించి వివరించారు. ఇదే పాఠశాలలో చదువుకున్న వారు ఎలాంటి ఉన్నత పదవులు అధిరోహించారో చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు షఫీ, రమేష్ బాబు, తదితరులతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పాలసముద్రంలో 'నా భూమి-నా దేశం'

ప్రజాశక్తి-గోరంట్ల రూరల్

మండల పరిధిలోని పాలసముద్రం గ్రామంలో నా భూమి–నా దేశం మట్టికి ప్రణామాలు వీరులకు వందనాలు కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా తొలుత స్వాతంత్ర్య సమర యోధులకు నివాళులు అర్పించి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం హై స్కూల్ ఆవరణలో మొక్కలు నాటారు. అలాగే మొక్కలు, మట్టి ఆవశ్యకతను విద్యార్థులకు వివరించా రు. కార్యక్రమంలో పాలసముద్రం గ్రామ పంచాయతీ సర్పంచి కె.చిన్నగంగప్ప, ఎంపిపి ప్రమీలమూర్తి, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, వార్డు సభ్యులు, సచివాలయ కన్వీనర్లు, సిబ్బంది, వాలంటీర్లు, ఫీల్డ్ అసిస్టెంట్, విద్యార్థులు పాల్గొన్నారు.

కల్లుమర్రి పంచాయతీలో..

మడకశిర : మండల పరిధిలోని కల్లుమర్రి ఉన్నత పాఠశాలలో శుక్రవారం నా భూమి–నా దేశం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా సర్పంచి గంగమ్మ నాగరాజు అమర వీరుల ప్రాణ త్యాగాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఈఒఆర్‌డి శైలజ, సెక్రటరీ వరదరాజు, గ్రామ పెద్దలు నారాయణగౌడ్, నర్సేగౌడ్, రామలింగప్ప, పెద్దమూర్తి, కదిరి నరసింహమూర్తి, నరసన్న, కొండప్ప, ముని, బాల బాలికలు పాల్గొన్నారు

ప్రాథమిక పాఠశాల తనిఖీ

పుట్టపర్తి రూరల్: మండల పరిధిలోని అమగొండపాలెం, ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఎంఇఒ ప్రసాద్ శుక్రవారం పరిశీలించారు. విద్యార్థుల వర్క్ పుస్తకాలు పరిశీలించి వివిధ ప్రశ్నలను విద్యార్థులను అడిగి సమాధానాలు రాబట్టారు. గ్రీన్ భారత్ ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణంలో విద్యార్థులతో మొక్కలు నాటించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఉపాధ్యాయులు వెంకటరత్నం, ప్రధానోపాధ్యాయులు శివకుమార్, గ్రీన్ భారత్ సంస్థ అధ్యక్షులు శంకరనారాయణ, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

హింందూపురం : సీజనల్ వ్యాధులపై పురపాలక సంఘ వ్యాప్తంగా విధులు నిర్వహిస్తున్న శానిటేషన్, హెల్త్ సెక్రటరీలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ అన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యలయంలో సెక్రటరీలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ ఇన్స్‌పెక్టర్ శంకర్ పాల్గొన్నారు.

ఇన్‌ఛార్జిమంత్రి, ఎమ్మెల్యేతో స్థానిక నాయకులు

ఇన్‌ఛార్జి మంత్రిని కలిసిన వైసిపి నాయకులు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి గుమ్మనూరు జయరాంను మండల వైసీపీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు తిరుపాల్ నాయక్, మాజీ మండల కన్వీనర్ గంగాధర్, శ్రీనివాసులు, కప్పల బండ నారాయణస్వామి మార్లపల్లి శేషాద్రి మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా వాటిని పరిష్కరిస్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు.

కొత్తచెరువు : శ్రీ సత్యసాయి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాంను స్థానిక వైసిపి నాయకులు కలిశారు. ఈ మేరకు మంత్రి పుట్టపర్తికి శుక్రవారం వచ్చిన నేపథ్యంలో వైసిపి నాయకులు వాల్మీకి శంకర్ తదితరులు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నుండి నిధులు తెప్పించి వాటిని పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి సంఘం నాయకులు మురళి, సాయి తదితరులు పాల్గొన్నారు

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - హిందూపురం

ప్రభుత్వం ప్రజల కోసం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని నియోజక వర్గ సమన్వయ కర్త, ఇన్ చార్జ్ దీపిక అన్నారు. శుక్రవారం రూరల్ మండలంకొటిపి వీరంపల్లి, ఇస్లాంపురంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగనన్న ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకురాలు మధుమతి రెడ్డి, స్థానిక సర్పంచి కె సరస్వతి, ఎంపీపీ రత్నమ్మ, వైస్ ఎంపీపీ రామాంజి, రాష్ట్ర సహాయ కార్యదర్శి కోటిపి హనుమంత్ రెడ్డి, కౌన్సిలర్లు షాజియా, మణి, నాగరాజు, ఎంపీటీసీ ధనుంజయ రెడ్డి, మంజుళ, వార్డు ఇన్‌ఛార్జులు, తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాలను పంపిణీ చేస్తున్న దీపిక వేణు రెడ్డి

విద్యుత్ సరఫరాలో అంతరాయం

లేపాక్షి : మండల పరిధిలోని 33 కె.వి శిరివరం లైన్ మరమ్మతుల కారణంగా 33/11 శిరివరం సబ్ స్టేషన్ పరిధిలోని శిరివరం, గోపిందేవరపల్లి, మనేపల్లి, గౌరిగానిపల్లి, వెంకటాపురం, తిరుమలదేవరపల్లి, కోడిపల్లి, విభూతిపల్లి, నాగేపల్లి, కొత్తపల్లి గ్రామాల్లో ఉదయం 10 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. కావున ప్రజలు విద్యుత్ శాఖకు సహకరించాలని ఎఇ వెంకటేశ్వర్లు ఓ ప్రకటనలో తెలిపారు.

కుక్క దాడిలో పలువురికి గాయాలు

రొద్దం : మండల పరిధిలోని తురకలాపట్నం గ్రామంలో శుక్రవారం తెల్లవారుజామున ఇళ్ల ముందు నిద్రిస్తున్న పలువురిపై కుక్క దాడి చేసి గాయపరిచింది. వారిలో శ్రీనివాసులు, గంగాధర్, ఈర్ఫాన్, నారాయణ రెడ్డి, మారెక్క, ఆదినారాయణ, హేమ, స్వరూప్‌తో పాటు మరికొందరిరు పెనుకొండ, అనంతపురం, తదితర ఆసుపత్రులకు వెళ్లి చికిత్స చేయించుకుంటున్నారు. అందులో మారెక్క తీవ్ర అస్వస్థతకు గురైనట్లు గ్రామస్తులు తెలిపారు.

టిడిపి కార్యకర్తపై దాడి హేయం

ప్రజాశక్తి-సోమందేపల్లి

టిడిపి కార్యకర్తపై అధికార వైసిపి నాయకుడు దాడి చేయడం హేయమైన చర్య అని పెనుకొండ నియోజకవర్గం టిడిపి నాయకులు కురుబ కృష్ణమూర్తి పేర్కొన్నారు. సోమందేపల్లిలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ గోరంట్ల మండలం వెంకటరమణపల్లిలో భూమి విషయంలో వైసిపి నాయకుడు చెవిరెడ్డి మరో పది మందితో కలిసి వేట కొడవళ్ళు, బీరు బాటిళ్లతో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడిన వ్యక్తి హిందూపురం ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారన్నారు. అతడికి ఏమైనా జరిగితే వైసిపి నాయకులే కారణమన్నారు. గాయపడిన వ్యక్తికి టిడిపి అండగా ఉంటుందని తెలిపారు. రాష్ట్రంలో వైసిపి నాయకుల ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోందని మండిపడ్డారు. దాడి చేసిన వారిని పోలీసులు తక్షణమే అరెస్టు చేసి శిక్షించాలని, అలాగే బాధితుడికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

మహిళా సాధికారతే టిడిపి లక్ష్యం

ప్రజాశక్తి-సోమందేపల్లి

టిడిపి కరపత్రాలు పంపిణీ చేస్తున్న మహిళా నాయకులు

మహిళలను సంపన్నం చేస్తూ మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యమని పెనుకొండ నియోజక వర్గ మాజీ ఎమ్మెల్యే బి కే పార్థసారథి పేర్కొన్నారు. మండల పరిధిలోని నాగినేని చెరువు, భూసాయ్యగారి పల్లి గ్రామాల్లోశుక్రవారం మహాశక్తి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా పార్థసా రథి భార్య కమలమ్మ, జిల్లా మహిళా అధ్యక్షురాలు సుబ్బరత్నమ్మ, నియోజకవర్గ అధ్యక్షురాలు అనసూయమ్మ, టిడిపి రాష్ట్ర అంగన్వాడి ఉపాధ్యక్షులు నాగమణి, తదితరులు ఇంటింటికి వెళ్లి భవిష్యత్తు గ్యారెంటీ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా పార్థసారథి మాట్లాడుతూ మహిళలను సంపన్నులు చేయడం మహిళా సాధికారతే లక్ష్యంగా చంద్రబాబు నాయుడు కషి చేస్తున్నారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ సిద్ద లింగప్ప, పార్లమెంట్ కార్యదర్శి చంద్రశేఖర్, భాను కీర్తి, సంజీవరెడ్డి, డివి ఆంజనేయులు, ఆశ్వర్థ, సూరి, కిష్ట తదితరు తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు.

రాగి పంట సాగును పెంచండి

వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు ప్రభాకర్

ప్రజాశక్తి-లేపాక్షి

మండలంలో రాగి పంట సాగు విస్తీర్ణం పెంచాలని వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు ప్రభాకర్ వ్యవసాయ అధికారులకు సూచించారు. స్థానిక ఎఒ కార్యాలయంలో శుక్రవారం ప్రభాకర్ అధ్యక్షతన వ్యవసాయ సలహా మండలి సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హిందూపురం వ్యవసాయ సహాయ సంచాలకులు అల్తాఫ్ అలీఖాన్ మాట్లాడుతూ ఈ క్రాప్ బుకింగ్‌ను పకడ్బందీగా చేయాలన్నారు. రాగి కనీస మద్దతు ధర రూ. 3,846 ఉందని, ఆర్‌బికెలలో సబ్సిడీపై రాగులు అందజేస్తారని కావున రైతులు రాగి పంటను సాగు చేయాలని కోరారు. హిందూపురం డివిజన్‌లో మండలానికి 3 కిసాన్ డ్రోన్స్ చొప్పున లక్ష్యం పెట్టారని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రభాకర్ మాట్లాడుతూ ఆర్‌బికె సిబ్బంది రైతులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ వ్యవసాయ శాఖలోని పథకాలను తెలియజేయాలని ఆదేశించారు. పశుసంవర్థక శాఖ అధికారి కిషోర్, విద్యుత్ శాఖ అధికారి వెంకటేశ్వర్లు, ఇరిగేషన్ ఎఇ నాగరత్న, పట్టు పరిశ్రమ శాఖ అధికారి శంకర్ నాయక్ వారి శాఖల్లో అమలవుతున్న పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎఒ శ్రీలత, వ్యవసాయ సలహా మండలి సభ్యులు, రైతులు, విస్తరణ అధికారులు, ఆర్‌బికె సిబ్బంది పాల్గొన్నారు.

అడిగిన కూలీలందరికీ ఉపాధి పనులు

సోషల్ ఆడిట్‌లో బోగస్‌కి ఆస్కారం ఇవ్వరాదు : పిఆర్ ఆర్డీ కమిషనర్ ఏ.సూర్యకుమారి, కలెక్టర్ గౌతమి

మాట్లాడుతున్న పిఆర్ ఆర్డీ కమిషనర్ సూర్యకుమారి, కలెక్టర్ గౌతమి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఉపాధి హామీ పథకం కింద డిమాండ్‌కు అనుగుణంగా అడిగిన వెంటనే పని కల్పించాలని పీఆర్ ఆర్డీ కమిషనర్ ఏ.సూర్యకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతపురం కలెక్టరేట్ లోని రెవెన్యూ భవనంలో శుక్రవారం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలుపై అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల ఏపీడీలు, ఏపీవోలతో కలెక్టర్ ఎం.గౌతమితో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యకుమారి మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం అత్యంత ముఖ్యమైనదన్నారు. ఉపాధి హామీ కింద ఒక కార్యక్రమం చేపడితే దీర్ఘకాలం ఉపయోగ ముండేలా చూడాలన్నారు. పేదరికం పోగొట్టేలా, జీవనోపాదులు ఎలా పెంచాలో చూడాలని, ఈ విషయమై అధికారులు మనసుపెట్టి బాధ్యతగా పనిచేయాలన్నారు. అధికారులకు కేటాయించిన బాధ్యతను సక్రమంగా నెరవేర్చాలని, లక్ష్యాలను ఎప్పటికప్పుడు చేరుకోవాలన్నారు. మంజూరు చేసిన జాబ్ కార్డులకు డిమాండుకు తగిన విధంగా కూలీలకు పని కల్పించాలన్నారు. వాటర్ షెడ్, లైవ్లీ వుడ్, హార్టికల్చర్ ద్వారా రైతుకు తన పొలం మీద వచ్చే దిగుబడి పెంచాలన్నారు. మెటీరియల్ కాంపోనెంట్ ద్వారా రోడ్డు వేస్తున్నామంటే దాని ద్వారా ఎటువంటి ఉపయోగం ఉంది అనేది గుర్తించి ఉపయోగపడేలా చూడాలన్నారు. ఉపాధి హామీ కింద ఏదైనా ఒక పని జరిగితే అది జీవనోపాధి పెంపొందించేలా, పేదరికం పోగొట్టేలా ఉండాలని, అందరికీ ఉపయోగపడేలా పనులు చేపట్టాలన్నారు. జాబ్ కార్డులున్న కుటుంబానికి వంద రోజులకు పైగా పనులు కల్పించాలన్నారు. పంచాయతీరాజ్, గ్రామీణ అభివద్ధి శాఖ అధికారులు కలిసికట్టుగా పని చేయాలన్నారు. గ్రామ పంచాయతీలో పనులు చేపట్టాలంటే గ్రామ సభ పెట్టి రెజ్యులేషన్ తీసుకోవాలన్నారు. ఎంపీడీవోలు మండల అభివద్ధిపై ప్రత్యేక దష్టి పెట్టాలని, గ్రామ పంచాయతీలకు సంబంధించి ఏ అవసరాలు ఉన్నాయి, ఏ విధమైన అభివద్ధి కార్యక్రమాలు చేపడుతున్నాము, తదితర అంశాలపై ఎంపీడీవోల చేతిలో బ్లూ ప్రింట్ అనేది సిద్ధంగా ఉండాలని, అప్పుడే అభివద్ధి పనులు చేసేందుకు వీలు కలుగుతుందన్నారు. ఎక్కడైనా అవకతవకలు జరిగితే చేపట్టే సోషల్ ఆడిట్లో బోగస్‌కి ఎలాంటి ఆస్కారం ఇవ్వరాదని, పక్కాగా చేపట్టాలన్నారు. డ్వామా, వాటర్ షెడ్ రెండూ అనుసంధానించుకుని పనిచేయాలని, హార్టికల్చర్ ప్లాంటేషన్ కు కేటాయించిన లక్ష్యాలను ఖచ్చితంగా చేరుకోవాలన్నారు. జగనన్నకు చెబుదాం పిటిషన్లకు సంబంధించి ప్రిమెచ్యూర్ గా పిటిషన్లను క్లోజ్ చేయరాదని, పూర్తిస్థాయిలో సమస్య పరిష్కారం అయిన తర్వాతనే పిటిషన్లు పరిష్కరించామని క్లోజ్ చేయాలన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యత భవన నిర్మాణాలకు సంబంధించి గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైయస్సార్ హెల్త్ క్లీనిక్స్ భవనాల్లో పూర్తయ్య దశలో ఉన్నవి వెంటనే పూర్తి చేయాలన్నారు. వెనుకబడిన మండలాల్లో త్వరితగతిన పురోగతి సాధించాలన్నారు. కలెక్టర్ గౌతమి మాట్లాడుతూ ఉపాధి హామీ కింద కేటాయించిన లక్ష్యాలను ఎప్పటికప్పుడు చేరుకునేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి పనుల్లో కూలీలను మరింత పెంచాలని, జిల్లాకు కేటాయించిన లక్ష్యాలను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలన్నారు. ఈ సందర్భంగా రెండు జిల్లాల్లో ఏపీడీల వారిగా లేబర్ బడ్జెట్ అచీవ్మెంట్, హౌస్ హోల్డ్ వారిగా ఎంప్లాయ్మెంట్ ప్రొవైడెడ్, మాస్టర్ల వెరిఫికేషన్, హార్టికల్చర్ ప్లాంటేషన్, ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలైన సచివాలయాలు, ఆర్‌బికెలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్స్ భవన నిర్మాణాలు, తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. సమీక్షలో ఈజీఎస్ డైరక్టర్ చిన్న తాతయ్య, హార్టికల్చర్ జాయింట్ డైరెక్టర్ అశోక్, ఈజీఎస్ జాయింట్ కమిషనర్ శివప్రసాద్, హార్టికల్చర్ జాయింట్ కమిషనర్ అశోక్ కుమార్, హార్టికల్చర్ డిప్యూటీ కమిషనర్ భవాని, డ్వామా పీడీలు వేణుగోపాల్ రెడ్డి, రామాం జనేయులు, జడ్పి సిఈఓ భాస్కర్‌రెడ్డి, పీఆర్ ఎస్‌ఈలు భాగ్యరాజ్, గోపాల్ రెడ్డి, డిపిఓ ప్రభాకర్ రావు, రెండు జిల్లాల ఏపీడీలు పాల్గొన్నారు.

శని, ఆదివారాల్లో ప్రత్యేక ఓటర్‌డ్రైవ్

టెలీ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ యం.గౌతమి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం–2024 కింద జిల్లాలో శని, ఆదివారాల్లో ఇంటింటి పరిశీలనలో భాగంగా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎం.గౌతమి ఆదేశించారు. శుక్రవారం రాత్రి అనంతపురం కలెక్టరేట్ లోని కలెక్టర్ ఛాంబర్ నుంచి ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం–2024కి సంబంధించి ఇంటింటి పరిశీలనలో భాగంగా చేపట్టిన ప్రత్యేక డ్రైవ్ పై ఈఆర్‌ఓలు, ఎఈఆర్‌ఓలు, తదితరులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా ఈనెల 12వ తేదీన శనివారం, 13వ తేదీన ఆదివారం రెండు రోజులపాటు ఇంటింటి పరిశీలనలో భాగంగా ప్రత్యేక డ్రైవ్ జిల్లాలోని అన్ని మండల కేంద్రాలు, అన్ని చోట్ల నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రత్యేక డ్రైవ్‌లో ఎవరైనా ఓటు హక్కు నమోదు చేసుకునేవారు ఓటు హక్కు నమోదు చేసుకోవచ్చున్నారు. ఏవైనా ఫిర్యాదులు ఉంటే టోల్ ఫ్రీ నెంబర్ 1950కి ఫోన్ చేయొచ్చున్నారు. ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమాన్ని జాగ్రత్తగా నిర్వహించాలని ఈఆర్‌ఓలు, ఎఈఆర్‌ఓలను ఆదేశించారు. ఓటు హక్కు నమోదు చేసుకునే వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

మండల మీట్‌లో విద్యుత్ సమస్యలు ఏకరువు

ప్రజాశక్తి-కనగానపల్లి

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సర్వ సభ్య సమావేశంల రసాభాసగా సాగింది. ముందుగా పలువురు సభ్యులు మండలంలో నెలకొన్న అప్రకటిత విద్యుత్ సమస్యలను సమావేశం దృష్టికి తెచ్చారు. అయితే విద్యుత్ సమస్యలపై వివరణ ఇవ్వాల్సిన మండల ఎఇ సమావేశానికి గైర్హాజరు కావడంతో సభ్యులు ఆవేదన అరణ్య రోదనగా మిగిలింది. విద్యుత్ సమస్యలపై అజెండా ప్రారంభం కాగానే సమావేశంలో సభ్యులు ఒకరి తర్వాత ఒకరు విద్యుత్ సమస్యలు ఏకరువు పెట్టారు. ముఖ్యంగా ముత్తువకుంట్ల ఎంపిటిసి శ్రీరాములు మాట్లాడుతూ పంచాయతీలో వున్న ట్రాన్స్‌ఫార్మర్స్ అన్నీ సమస్యగానే వున్నాయన్నారు. ఏడాడిగా ఈ విషయాన్ని సభ దృష్టికి తెస్తున్నా, అధికారులకు విన్నవించినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల తోటల్లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్స్‌కు జంపర్ వేయటానికి లైన్‌మెన్ రావాలంటే ముందు రూ. 500 ఇస్తేనే వస్తానని చెబుతున్నారని ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో ఎంపిపి కుంపటి భాగ్యమ్మ, అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో విద్యుత్ సమస్యలను ఏకరువు పెడుతున్న సభ్యులు